నేడు 'హెరిటేజ్ వాక్ 3'

సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలిలోని లాంకో హిల్స్, క్లబ్ జియస్ వేదికగా నేడు 'హెరిటేజ్ వాక్ 3' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ హెరిటేజ్ వాక్‌లో భాగంగా గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, ఖాజాగూడ, లాంకోహిల్స్ తదితర ప్రాంతాలవాసులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రాంతంలోని ప్రతిష్ఠాత్మక 'హెరిటేజ్ రాక్ పార్క్' ఔన్నత్యాన్ని తెలియజేసేలా, ఇలాంటి ప్రదేశాలను పరిరక్షించేలా అవగాహన కల్పించడానికి ఈ వాక్ ఏర్పాటు చేశామన్నారు. ఈసారి మూడవ హెరిటేజ్ వాక్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు పాల్గొంటారని వారు తెలిపారు.

దరఖాస్తు గడువు 23 వరకు పొడిగింపు

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహిస్తారని గౌలిదొడ్డి గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ ఏ శారద తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 23వ తేదీ వరకు గడువు పొడిగించారని ,ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటిన వారికి ఈ విద్యాసంస్థలలో చేరేందుకు అవకాశం కల్పిస్తారని ఆమె వివరించారు.

హెచ్‌సీయూ ప్రొ.చంద్రశేఖర్ భట్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



ఐఎస్ఎస్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు స్వీకరిస్తున్న భట్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు అరుదైన అవార్డు లభించింది. హెచ్‌సీయూలోని సోషియాలజీ, ఆంత్రోపాలజీ విభాగం 1979లో ప్రారంభించినప్పటి నుంచి ప్రొఫెసర్ చంద్రశేఖర్ భట్ విధుల్లో ఉన్నారు. భారతీయ సామాజిక శాస్త్రాల సంఘం (ఐఎస్ఎస్) ప్రతిష్ఠాత్మకమైన జీవితకాల సాఫల్య (లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్) అవార్డును ఇటీవల స్వీకరించారు. దశాబ్దాలుగా సోషియాలజీ అధిపతిగా యూజీసీ-ఎస్ఏపీ కోఆర్డినేటర్‌గా, యూజీసీ సబ్జెక్ట్ ప్యానెల్ సభ్యునిగా సామాజిక శాస్త్రానికి చెందిన ప్రముఖ విభాగాల్లో ఒక దానిని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారు. ఆయనకు జీవితకాల సాఫల్య అవార్డు రావడం పట్ల పలువురు ప్రొఫెసర్లు ఆయనను అభినందించారు.

రోడ్లపై వ్యర్థాలు పారబోస్తే కఠిన చర్యలు

- వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్

గచ్చిబౌలి: నిర్మాణ వ్యర్థాలు రోడ్ల వెంట, కాలనీలోని ఖాళీ స్థలాల్లో డంప్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ హెచ్చరించారు. గౌలిదొడ్డి, హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ సమీపంలో డంపింగ్ పాయింట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు అక్రమ డంపింగ్‌పై నిఘా పెట్టారని పేర్కొన్నారు. నిర్మాణ వ్యర్థాలను డంప్ చేసి మొదటిసారి పట్టుబడితే రూ.25 వేలు, రెండవ సారి పట్టుబడితే రూ.50 వేలు, మూడోసారి పట్టుబడితే లక్ష రూపాయల జరిమానా, కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేస్తామని చెప్పారు. అక్రమ డంపింగ్‌పై టోల్ ఫ్రీ నెంబర్ 18001201159, వాట్సాప్ నెంబర్ 9100927073 లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నృత్యార్చన



మాదాపూర్: కళాకారులు నృత్యాలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా భాస్కర డ్యాన్స్ అకాడమీ శిష్యబృందం పుష్పాంజలి, గణేశకౌతం, కృష్ణ కలయసఖి, రామాయణ శబ్దం, హనుమాన్ చాలీసా, బ్రహ్మమురారీ, సంకీర్తనలను కూచిపూడి నృత్యరూపంలో ప్రదర్శించారు. అకాడమీ గురువు డి.సాత్విక, శిష్యబృందాన్ని జ్ఞాపికలతో సత్కరించారు.

దేశవ్యాప్తంగా కులగణన జరగాలి

రాయదుర్గం: కులగణనతో సామాజిక న్యాయం, సమగ్ర ఆర్థికాభివృద్ధి, అణగారిన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించడంలో ముఖ్య భూమిక పోషిస్తుందని భారత్ జోడో అభియాన్ కోఆర్డినేటర్ యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స అసోసియేషన్ ఆధ్వర్యంలో హెచ్‌సీయూలో నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ప్రొ.వెంకటేష్ మాట్లాడుతూ కులగణన దేశవ్యాప్తంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ ఓబీసీ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ అధ్యక్షుడు ఆళ్ళ రామకృష్ణ, వివిధ యూనివర్శిటీల ప్రొఫెసర్లు, ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐఓబీసీఎస్ఏ నాయకులు సాయికిరణ్, కొండల్, మురళి యాదవ్, శివయాదవ్, ప్రవీణ్, లక్కీ, సాయి దీపక్ పాల్గొన్నారు.

సంకీర్తనాలాపన



మాదాపూర్: కళాకారులు వీణానాదంతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం ఆంపిథియేటర్‌లో రాయప్రోలు సుధాకర్ శిష్య బృందం వీణతో వివిధ రకాల సంకీర్తనలను ఆలపించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


సతీష్ (ఫైల్)

హఫీజ్‌పేట్ : ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రఘు తెలిపిన ప్రకారం..చందానగర్ పాపిరెడ్డి కాలనీకి చెందిన నాగరాణి కుటుంబంతో నివాసముంటుంది. ఆమె తమ్ముడు సతీష్ (24) గతంలో ఫ్లిప్‌కార్ట్‌లో పని చేసేవాడు. నెల రోజుల నుంచి ఉద్యోగం లేక ఖాళీ ఉంటున్నాడన్నారు. దీంతో సతీష్ నిరాశ చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని అక్క నాగరాణి రాత్రి ఇంటికి రాగా ఎంతసేపటికి తలుపులు తీయకపోవడంతో కిటికిలో నుంచి చూసింది. వెంటనే ఇంటి పక్కన ఉన్న వారి సహాయంతో తలుపులు బద్దలుకొట్టి చందానగర్ పోలీసులకు సమాచారం అందించింది. తమ్ముడి ఆత్మహత్యపై అనుమానం ఉందని పోలీసులకు తెలుపడంతో కేసు నమోదు చేశారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

జాతీయ ఓటరు దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

- ఏర్పాట్లు పరిశీలించిన జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, రోనాల్డ్ రోస్
- హాజరు కానున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ సీఈఓ, గ్రేటర్ కమిషనర్ , జిల్లా కలెక్టర్ గౌతమ్

కూకట్‌పల్లి: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 25న మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లి జేఎన్‌టీయులో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమీషనర్ రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్ గౌతమ్‌లు అవసరమైన ఏర్పాట్లు, వసతులను పరిశీలించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగించే సమయంలో సభా వేదికతో పాటు పాల్గొనే వీఐపీల కోసం వసతులు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లాలోని కూకట్‌పల్లి జేఎన్‌టీయులో జరిగే కార్యక్రమానికి గవర్నర్ హాజరు కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అదే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా తెలిపారు. కార్యక్రమానికి వచ్చే వారికి సంబంధించి పార్కింగ్ తదితర వివరాల విషయమై పోలీసులకు అవసరమైన సూచనలు అందించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమీషర్ అభిలాష్ అభినవ్, ఖైరతాబాద్ జోనల్ కమీషనర్ వెంకటేష్, ఆర్‌డిఓ శ్యామ్ ప్రకాశ్, పోలీస్ అధికారులు, జేఎన్‌టీయూ అధికారులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యమివ్వాలి


ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న దుర్గారాణి

కూకట్‌పల్లి: నాయీ బ్రాహ్మణులకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ నాయీ బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఎ.దుర్గారాణి శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత, తెలంగాణ రాష్ట్రంలోని కళ్యాణ కట్టల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అదే విధంగా దేవాలయ బోర్డు మెంబర్‌గా అవకాశం కల్పించాలని తలనీలాల టెండర్లలో రిజర్వేషన్ కల్పించాలని కోరినట్లు తెలిపారు. అదే విధంగా నాయీ బ్రాహ్మణుల యువతీ, యువకులకు బ్యూటీ శిక్షణ కోర్సుల సర్టిఫికెట్‌తో కూడిన శిక్షణ ఇచ్చి పనిముట్లు అందజేయాలని కోరినట్లు తెలిపారు.

ఫిట్జీ ఆధ్వర్యంలో అతిపెద్ద స్కాలర్‌షిప్ పరీక్ష 28న

సాక్షి, సిటీబ్యూరో: విద్యా సంబంధిత శిక్షణ తరగతులు నిర్వహించే ఫిట్జీ (ఎఫ్ఐఐటీజేఈఈ) సంస్థ ఆధ్వర్యంలో 'ద్రోణాచార్య 360 డిగ్రీ డయాగ్నోస్టిక్స్ స్కాలర్‌షిప్ టెస్ట్'ను నిర్వహించనున్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద స్కాలర్‌షిప్ పరీక్షగా సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. 5వ తరగతి నుంచి 11వ తరగతికి మధ్య విద్యార్థులకు ఉపకరించే ఈ స్కాలర్‌షిప్ పరీక్షను ఈ నెల 28న, ఫిబ్రవరి 2న నిర్వహిస్తున్నామని, నగర విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కావాలంటే పరీక్షకు 2 రోజుల ముందే https://dronacharyaexam.fiitjee.com/registration-process.html ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: 'వరల్డ్ పీస్ డే'ను పురస్కరించుకొని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో సండే ఈవినింగ్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ బి.కె వసంత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

యజ్ఞంలా రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ


కార్యక్రమంలో పాల్గొన్న కమలాకర్‌రెడ్డి, కుమార్‌యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ హనుమాన్ దేవాలయంలో డివిజన్ అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో నేషనల్ ఆఫీస్ కో-ఆర్డినేటర్ కుమార్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం దేశంలో ఒక యజ్ఞంలా జరుగుతుందన్నారు. ప్రజలందరూ భాగస్వామ్యం కావటం ప్రపంచానికి గొప్ప సందేశాన్ని పంపినట్లుగా ఉన్నదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు, మహిళా మోర్చా నాయకురాలు స్రవంతి పాల్గొన్నారు.

డైరెక్ట్ ఇంగ్లిష్ శిక్షణ కేంద్రం ప్రారంభం

కూకట్‌పల్లి: డైరెక్ట్ ఇంగ్లిష్ శిక్షణ కేంద్రాన్ని కేపీహెచ్‌బీ కాలనీలో శనివారం ప్రారంభించారు. అకడమిక్ కౌన్సిల్ చైర్మన్, సెయింట్ జోసెఫ్ కళాశాల ప్రిన్సిపాల్ రెవ. అంథోని సగయ రాజా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఇంగ్లీష్ నేర్చుకోవాలనుకునే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సోన్యా చౌదరి పాల్గొన్నారు.



ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

మోతీనగర్: అయోధ్యలో శ్రీ రామమందిర నిర్మాణం, శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అవంతి నగర్ తోట వెల్ఫేర్ అసోసియేషన్ దేవాలయ కమిటీధ్వర్యంలో శ్రీ సాయిబాబా, ఉమామహేశ్వర, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో, పీఆర్‌నగర్‌లో శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో, శృంగేరి శారద శంకరమఠంలో, శ్రీ శివరామాంజనేయ దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంకితభావంతో ప్రజలకు సేవలందించాలి



- సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి
- 138 మంది పోలీసు సిబ్బందికి పతకాలు అందజేత

రాయదుర్గం: అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో శనివారం 138 మంది పోలీసు సిబ్బందికి పతకాలు అందించారు. అందులో 58 మందికి ఉత్కృష్ట సేవా పతకాలు, 80 మందికి సేవా పతకాలు అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖకు మంచి పేరు వచ్చేలా విధులు నిర్వహించాలని సూచించారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్ నాయక్ మాట్లాడుతూ కుటుంబసభ్యుల సహకారం లేనిదే విధుల్లో ఉత్తమ పనితీరు కనబర్చలేమన్నారు. కార్యక్రమంలో డీసీపీ అడ్మిన్ రవి చందన్‌రెడ్డి, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, ఏసీపీలు, సీఏఓ అడ్మిన్ గీత, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సెక్షన్ సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

మట్టికుప్పలు ప్రమాదాలకు నిలయాలు



బాలాజీ స్వర్ణపురి కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న రోడ్డు నిర్మాణ వ్యర్థాలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ స్వర్ణపురి కాలనీలో ఇటీవల పురాతనంగా ఉన్న రోడ్ల స్థానంలో ఆధునీకరమైన రోడ్లను వేశారు. రోడ్లు వేసేటప్పుడు తీసిన రాళ్లు, మట్టి, ఇతర వ్యర్థాలను రోడ్డు పక్కనే వదిలివేశారు. రోడ్డు వేసి కొన్ని రోజులవుతున్నా ఇంత వరకు వ్యర్థాలను తొలగించకపోవటంతో రోడ్డు మూలమలుపు ప్రాంతంలో అవి ప్రమాదకరంగా తయారయ్యాయి. సమీపంలోనే పాఠశాల, ఫంక్షన్ హాలు ప్రధాన రోడ్డు పక్కనే ఉండటంతో వాహన చోదకులు, పాదాచారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మాణ సమయంలో పనులు పూర్తయిన వెంటనే తొలగించవలసిన బాధ్యత సిబ్బందిదే. వారి నిర్లక్ష్యంతోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు పక్కన పెద్ద కుప్పల్లాగా వేయటంతో అటుగా వెళ్లే వాహన చోదకులకు రాత్రి వేళల్లో దారి కనపడక ప్రమాదాలు సైతం సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పక్కన ఉన్న మట్టి రాళ్ల కుప్పలను వెంటనే తొలగించాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

'వడ్డేపల్లి'ని కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు



కూకట్‌పల్లి: వివేకానందనగర్‌లోని వడ్డేపల్లి రాజేశ్వరరావు స్వగృహంలో శనివారం ఫతేనగర్ శివాలయం హట్స్ నూతన కార్యవర్గ సభ్యులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షులు నర్సింహులు, సెక్రటరీ కుర్మయ్య, ఉపాధ్యక్షులు కృష్ణ, నర్సింహులు, బీజేపీ నియోజకవర్గ ఓబీసీ కోకన్వీనర్ సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ



మూసాపేట: ప్రశాంత్‌నగర్‌లోని ఎస్ సంజీవ రెడ్డి ఫౌండేషన్‌లో శనివారం మగ్గంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ మగ్గం కార్యక్రమాన్ని చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించింది. ఈ సందర్భంగా సీనియర్ ప్రైవేట్ సెక్రటరి ఎస్ఐడిబిఐ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అసిస్టెంట్ మేనేజర్ డా. శివకుమార్, విశాఖపట్నం కోయిర్ బోర్డు, రిటైర్డ్ మేనేజర్ వెంకటరామన్‌లు అతిథులుగా హాజరయ్యారు.

వేణుగోపాల స్వామి ఆలయాన్ని శుభ్రం చేసిన బీజేపీ నేతలు



కూకట్‌పల్లి: అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో దేశంలోని దేవాలయాలను పరిశుభ్రం చేయాలన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు కేపీహెచ్‌బీకాలనీలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో పరిశుభ్రం కార్యక్రమంలో శనివారం మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆలయాన్ని, పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం 1990లో అయోధ్య కరసేవ కార్యక్రమంలో పాల్గొన్న కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మహేష్‌లను ఘనంగా సన్మానించారు.

వారం రోజుల పాటు పిల్లలకు పలు కార్యక్రమాలు

సాక్షి, మేడ్చల్‌జిల్లా: బేటీ బచావో- బేటీ పడావో పథకంలో భాగంగా జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వారం రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జి.క్రిష్టారెడ్డి తెలిపారు. అందులో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. పోస్టర్‌తో పాటు బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పద్మజారాణి, డీఈఓ విజయకుమారి, సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు, పిల్లల లింగ నిష్పత్తిపై గ్రామస్థాయిలో మహిళా సభలు, ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమ అధికారి జి.క్రిష్టారెడ్డి పేర్కొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు కూడా అందజేస్తామన్నారు.

బడిలో మోగిన ఎన్నికల గంట

- నాలుగేళ్ల తర్వాత ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్
- పాఠశాలల్లో తల్లిదండ్రుల పేర్ల జాబితా వెల్లడి
- 29న ఎన్నికల నిర్వహణకు విద్యాశాఖ చర్యలు
- గ్రేటర్, శివారు జిల్లాలో 2,447 బడుల్లో ఎన్నికలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాల విద్యా కమిటీల పదవీ కాలం తరచూ పొడగిస్తూ వచ్చిన విద్యాశాఖ ఎట్టకేలకు ఎన్నికల షెడ్యూల్ జారీ చేసింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల కోలాహలం నెలకొంది. ప్రభుత్వ బడుల్లో చేపట్టే అభివృద్ధి, ఇతర కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకునే ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. చివరిసారి 2019 నవంబర్‌లో విద్యా కమిటీ చైర్మన్ ఎన్నిక నిర్వహించింది. అనేక వాయిదాల తర్వాత కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది.

గ్రేటర్ జిల్లాల్లో 2,447 బడులు

గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 2,447 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇందులో హైదరాబాద్ జిల్లాలో 631 పాఠశాలలు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 515 పాఠశాలలు, రంగారెడ్డి జిల్లాలో 1,301 పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రభుత్వ బడుల్లో 29న ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ప్రభుత్వ బడుల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో పాల్గొనే విధంగా ప్రధానోపాధ్యాయుడు నోటీసు జారీ చేశారు. మధ్యాహ్నం విద్యార్థుల తల్లిదండ్రుల పేర్ల జాబితాను పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. 22న ఎన్నికల్లో పాల్గొనే తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 24న పోటీలో ఉన్నవారి తుది జాబితా ప్రదర్శిస్తారు. 29న ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకు చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు కొత్తగా ఏర్పడిన కమిటీతో సమావేశం నిర్వహించి బడిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించాలి.



ఎస్ఎంసీ ప్రధాన లక్ష్యం..

పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతి రెండు నెలలకోసారి ఎస్ఎంసీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయాలి. ఎస్ఎంసీలు విద్యాలయాల అభివృద్ధిలో ప్రత్యేకత కనబర్చాలి. సూచనలు, సలహాలివ్వడంతో పాటు పాఠశాలకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలి. విద్యాప్రగతి, కార్యక్రమాలపై సమీక్షించాలి. పిల్లల నమోదు సంఖ్య పెంచడం, హాజరు మెరుగుపర్చడంలో భాగస్వాములు కావాలి. 6 నుంచి 14 ఏళ్ల వయస్సు కలిగిన బడీడు విద్యార్థులను గుర్తించి వారిని బడిలో చేర్పించడం. గ్రామ విద్యా రిజిస్టర్ నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షించాలి. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంటోంది.

నిబంధనల ప్రకారం

చైర్మన్, వైస్ చైర్మన్ సహా ఒక్కో తరగతి నుంచి ముగ్గురు ఎన్నికైన తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు మరో ఐదుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉంటారు. ప్రధానోపాధ్యాయుడు మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. 1 నుంచి 8 తరగతుల్లోని విద్యార్థుల తల్లితండ్రులే సభ్యులుగా ఉంటారు. 9, 10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీ చేసే అవకాశం లేదు. ఎన్నికలు నిర్వహించే సమయంలో కనీసం 50 శాతం తల్లిదండ్రులు హాజరుకావాలి. చేతులెత్తడం, నోటితో చెప్పే పద్ధతితో ఎన్నికలు నిర్వహించాలి. ఎస్ఎంసీల పదవీ కాలం రెండేళ్లు, వారి కాలపరిమితి ముగిసినా, విద్యార్థులు పాఠశాలను వదిలివెళ్లినా ఏది ముందు జరిగితే దాన్ని పరిగణనలోకి తీసుకుని సభ్యత్వం తొలగిస్తారు.

ఎన్నికల ప్రక్రియ పక్కా నిర్వహించాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నాం. షెడ్యూల్‌ను ప్రధానోపాధ్యాయులు క్షుణంగా చదివి ఎన్నికల ప్రక్రియ పక్కాగా నిర్వహించాలి. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలి.
– ఐ.విజయకుమారి, విద్యాశాఖ అధికారి, మేడ్చల్ జిల్లా